## గ్రహాల అనుగ్రహం మీదే జీవితగమనం వుందని నమ్మిన అతని జీవితం?


# పరంధామయ్యగారు

వసంతరావు రామకృష్ణా రావు కథ

అరవయ్యవ పడిలో పడిపోయిన పరంధామయ్యగారిని గురించి తెలియనివాళ్లు ఆ గ్రామంలో లేరు. ఉద్యోగరీత్యా, ఉపాధ్యాయుడిగా ఆయన అనేక గ్రామాల్లో పనిచేసినా, తన స్వంత గ్రామం అయిన పెనుగొల్లు చేరుకుని, తన పదవీ విరమణ కాలాన్ని శాంతంగానూ, విశ్రాంతంగానూ గడుపుకొంటున్నారు. అధ్యాపక వృత్తిలోనే ఆయన జీవితం గడిచిపోవడంచేత విద్యార్థులకు పాఠాలు బోధించడమేగాకుండా క్రమశిక్షణకోసం వారిని బాధిరచడం జరిగింది. అయినా, ఆయన అంటే విద్యార్థులకే కాకుండా ఆ గ్రామంలో వుండే పెద్దలకు చాలా గౌరవం.

పరంధామయ్యగారు ఏకవచన ప్రయోగం సహించలేరు. చిన్నప్పటినుండి తన భార్య, పిల్లలు, ఇరుగుపొరగువారు, హితులు, సన్నిహితులు, పురోహితులు, స్తుతమతులూ - వీరందరూ వారిని అయ్యా అని పిలవాలి. ఏమండీ అని అనాలి. అందులో ఏమాత్రం తేడా వచ్చినా ఊరుకోలేని వింత మనస్తత్వం ఆయనది. మంచికీ, మర్యాదకీ, మన్ననకీ, మానవతకీ విలువలు కలవని నమ్మి, ఆ విధంగానే వారు తమ జీవితం గడిపేరు. తనవద్ద చదువుకున్నవారికి మంచితనమూ, మంచి గుణములూ నేర్పేరు.

పరంధామయ్యగారి సుదీర్ఘమైన అధ్యాపక జీవితంలో వారు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. దుడుకు విద్యార్థుల ధాటిని తట్టుకున్నారు. ''రాజకీయమే ధ్యేయంగా పెట్టుకుని తనను అనేక విధాలుగా ఇబ్బందులకు, ఇక్కట్లకు గురిచేసిన రాజకీయ నాయకులకు ఆయన తలబగ్గలేదు. అలాగని వారితో గొడవలు పడలేదు. ఘర్షణలకు దిగలేదు. చిన్ననాడు పరంధామయ్యగారు మిషనరీ స్కూలులో




చదువుకున్నప్పటికీ, ధ్యానం, పూజ, సంధ్యావందనం, గీతాపారాయణం మానలేదు. అందరిచేతా గుర్తింపు, గౌరవం పొందిన పరంధామయ్యగారికి ఒక చాదస్తం వున్నది. తల్లిగారు వద్దని చెప్పినా చదువుకునే రోజులలో తన తండ్రిగారితో పరిచయంగల ఒక నాయుడుగారింటికి వెళ్లి, జాతకబోధిని చదివేవారు. హస్త సాముద్రికం అంటే ఆయనకు వల్లమాలిన

అభిమానం. అంతేకాదు. తాను చేసే ప్రతిపనికీ జరుగబోయే ప్రతి సంఘటనకీ తన జాతకంలోని గ్రహగతియే కారణం అని మనసారా నమ్మేవారు. ఏ పని చేయాలన్నా దగ్గర్లో వున్న తెలుగు క్యాలెండరో లేదా పంచాంగమో చూసి అనుకూల, ప్రతికూలతలను బట్టి ఆయా పనులు చేయడం వారికి అలవాటు. అది వారికి పరిపాటికూడా! పొరపాటునకూడా ఆయన పంచాంగ శుద్ధి చూడకుండా ఏ పనీ చేయరు. ఆ విధంగా అంటే గ్రహానుకూలత చూడకుండా వారి దినచర్య సాగదు! వారు జాతక పఠనం చేయడం తల్లిగారికి తెలిసి, ఆమె మందలించడంతో, జ్యోతిష్యం గురించి ముందుకు సాగలేకపోయినా, గ్రహాలు, వాటి గమనం మీద ఆధారపడే అనేక విషయాలు, విశేషాలు - వీని గురించి వారికి కొంత పరిజ్ఞానం ఉన్నది. జీవితంలో తనకు కలిగిన అనుభవాలనుబట్టి వారు తమకు అలవడిన కొద్దిపాటి జ్యోతిషజ్ఞానముతో పరిశీలన చేసి, వాటిగురించి అభిప్రాయాలేర్పరచుకునేవారు. తనకుగల కొన్ని నమ్మకాలనుకూడా ఆయన తన బంధుమిత్రులకు చెప్పి, జ్యోతిష్యం ఒక గొప్ప శాస్త్రం అనీ, విద్యావంతులైనవాళ్ళు, బుద్ధిమంతులూ, జ్యోతిష్యం ప్రకారం తమ తమ కార్యకలాపాలను సాగించాలి అని ఆయన చెపుతుండేవారు. తాను నమ్మినవి ఎల్లా జరిగినవీ, తనకు దైనందిన జీవితంలో అడుగడుగునా, తన గ్రహచారము ప్రకారము పనులు ఎలాగ సాధ్యమైనదీ - లేదా - తాను అనుకొనిన పనులు ఏ విధంగా భగ్నమైనదీ - పూస గ్రుచ్చినట్లు అందరికీ వివరించి చెపుతూ వుండేవారు. గ్రహాలు, జాతకాలు, హస్తసాముద్రికాలు - ఇవి అన్నీ నమ్మరానివి అని ఎవరేనా అంటే పరంధామయ్యగారు వారిని కూర్చోపెట్టుకుని క్లాసు తీసుకుని మరీ విడిచిపెట్టేవారు! ఆ కారణంచేత దాని విషయమై ఆ గ్రామంలో ఎవరూ వారితో వాదించే ప్రశ్నలేదు.

యూనివర్శిటీలో నేను ఎంచుకున్న విషయంమీద పరిశోధన చేస్తున్న రోజులలో నా మిత్రుడు ఒకరు శ్రీ పరంధామయ్యగారిని కలుసుకోమని, వారి వద్ద నాకు కావలసిన పరిశోధనా సామగ్రి పుష్కలంగా లభిస్తుందని చెప్పడంతో, నేను బస్సుమీద పెనుగొల్లు బయలుదేరాను.

3 గంటల ప్రయాణం విసుగు కలిగించింది. పైగా బాగా ఆకలి వేస్తూ వుండడంతో నేను ఆ గ్రామంలో ఏదైనా కాఫీ హోటల్ వుంటుందేమో అని కొంతదూరం వెళ్లాను. గ్రామం చాలా చిన్నది. రోడ్డుకు రెండువైపులా పాకల ఇండ్లు, కాస్త దూరంలో పచ్చని పంటపొలాలూ - అక్కడక్కడ ఉన్ననూతులవద్ద ఆడవాళ్లు నీళ్లు తోడుకుంటూ, ఏవో తమ కుటుంబ విషయాలు మాట్లాడుకోవడం చూసేను. దగ్గరలో ఆకలి తీర్చే మంచి కాఫీ ఫలహారశాల కనిపించలేదు. దానితో నా ఆకలీ, ఆకలితోపాటు అసహనమూ, చిరాకూ కలుగుతున్నవి. బయలుదేరే ముందు అమ్మ చాలా ఆప్యాయంగా ప్రేమతో ''ఒరే బుజ్జీ! నీవు రీసెర్చి అంటూ ఎటో బయలుదేరుతున్నావు. నీకు అక్కడ సరియైన టిఫిన్,కాఫీ, భోజనం దొరక్కపోవచ్చు. పైపెచ్చు నీవు వెళ్తున్నది నగరంకాదు, పట్టణం అంతకన్నా కాదు. అది ఒక గ్రామం. నేను రెండుమూడుసార్లు మా నాన్నగారితో ఆ ఊరు వెళ్లేను. అక్కడ మన బంధువులు అప్పట్లో అక్కడ వుండబట్టి మాకు భోజన వసతి సదుపాయాలు అమరినాయి. కాబట్టి అల్లంవేసి ఉప్మా చేస్తాను. అది తిను. నీకు ఆ ఊరిలో తినడానికి నీకు ఇష్టమైన ఇడ్లీ, సాంబారు చేసి క్యారియర్‌లో పెడతాను'' అన్నది. అమ్మమీద నాకు ఉన్న గౌరవంచేత, తెల్లవారుజామునే లేచి నాకోసం ఆమె శ్రమపడడం ఇష్టం లేక నేను వద్దని బయలుదేరేను. ఎంత గ్రామం

అయినా ఆ మాత్రం పాక హోటలు లేదా కాకా హోటలు వుండదా అనే నమ్మకంతో వచ్చిన నాకు తగిన శాస్తి జరిగింది. ఆకలి తీరే మార్గం లేదనిపించింది. ఎదురుగా వున్న కిళ్లీ బడ్డీలో బిస్కెట్లు తిన్నాను. కాని నా ఆకలికి అది సరిపోలేదు. సరే అనుకుని పరంధామయ్యగారి ఇంటికి వచ్చేను.

పరంధామయ్యగారి ఇల్లు అందంగా వున్నది. ఆ గ్రామంలో వున్న పూరి పాకల ఇళ్ల నడుమ వారి ఇల్లు నక్షత్రాల మధ్య ఉన్న చంద్రుడిలా కనిపించింది. వారింట్లో నాకు అవసరమైన ఫలహారం, కాఫీలాంటిది లభిస్తాయనే ఆశతో, గబగబా నాలుగు అడుగులు ముందుకు వేశాను. ఎదురుగా పరబ్రహ్మం కనిపించేడు! నా ఆశ్చర్యానికి అంతులేదు. ఎప్పుడో వాడూ, నేనూ కలిసి హైస్కూలులో చదువు వెలగబెట్టేం. తరువాత నేను పూర్తిగా కళాశాల, యూనివర్శిటీ విద్యలోనే వుండిపోయేను. అక్కడతో ఆగకుండా పరిశోధన అంటూ ఒక సాధన మొదలుపెట్టేను. అప్పట్లో నాతో చదువుకున్నవాళ్లందరూ ఎక్కడికక్కడ చెదిరిపోవడం, కొంతమంది పొట్ట చేత్తో పట్టుకుని పై ప్రాంతాలకు ఉద్యోగాలకు పోవడం - ఈ కారణాలచేత నేను ఒంటరిగా వుండిపోయేను!

నన్ను చూస్తూనే బ్రహ్మం చాలా ఆప్యాయంగా కౌగిలించుకుని, నా చేతులను తన చేతుల్లోకి తీసుకుని, పరంధామయ్యగారి డ్రాయింగ్‌రూమ్‌లో చల్లగా తిరిగే సీలింగ్ ఫ్యాన్ క్రింద కూర్చోబెట్టేడు. ఆ సమయంలో నాకు పోయిన ప్రాణం వచ్చినట్లు అనిపించింది. వాడు తెచ్చి ఇచ్చిన వేడి ఉప్మా తిన్నాక నాకు తెలియని ఒక ఆనందమూ, సంతృప్తి కలిగినాయి.

అప్పుడు చెప్పేడు పరబ్రహ్మం. తాను పరంధామయ్యగారి కొడుకుగా పరిచయం చేసుకుంటూ వారి గురించి, నాకు కావలసినదానికన్నా ఎక్కువగా వివరాలు గబగబా చెప్పేడు. పరంధామయ్యగారు పూజలో వున్నందున కనీసం ఒక గంటవరకు వారితో మాట్లాడే వీలుండదని గుర్తించిన నేను వ్రాసి తెచ్చుకున్న థీసిస్ కాగితాలు తిరగేస్తూ, మధ్యమధ్య ఆకాశవాణి ప్రసారం వింటూ కాలం వెళ్లబుచ్చాను. అయితే నాకు పరబ్రహ్మంగాడు (వాడిని గాడని పిలవడం నా అలవాటు) తన తండ్రిగారి గురించి అందించిన

## లక్కీ నెంబర్

''హతుణ్ణి మూడు పోట్లు పొడిచి ఎందుకు చంపావు'' అడిగాడు లాయరు ముద్దాయిని.

''మూడు నా లక్కీ నెంబర్ సార్'' చెప్పాడు ముద్దాయి.

-లకనంమూర్తి (కాకినాడ)



అనేకములైన విషయాలునాకు చాలా ఆసక్తికరంగా వున్నాయి. విజ్ఞానంతోపాటు, విద్యతోపాటు, కాస్త వినోదంకూడా నాకు కలిగే అవకాశం వచ్చినందుకు చాలా సంబరపడ్డాను. పరంధామయ్యగారితో భేటీకి ధాటిగా సిద్ధమయ్యాను!

పూజ పూర్తిచేసుకుని వచ్చి, ఈజీ చైర్‌లో కూర్చుని వున్న పరంధామయ్యగారికీ, నాకూ చాలా రసవత్తరమైన సంభాషణ ఇలా సాగింది.

నేను : అయ్యా! నమస్కారం. నేను...

పరం: ఆ! నాకు తెలుసు - నీవు రీసెర్చి చేస్తున్నావని మీ మిత్రుడు అంటే మా అబ్బాయి బ్రహ్మం చెప్పేడు. కాని ఈ విషయంలో నేను ఎంతవరకు నీకు తోడ్పడగలనో నాకు తెలియదు.

నేను : మీ ఆశీస్సులు నాకు చాలు - నేను అడిగే ప్రశ్నలకు, పెద్దలైన మీరు నన్ను మన్నించి జవాబులిస్తే నా థీసిస్‌కు కొంతవరకు అవి తోడ్పడతాయి.

పరం: అలాగే - అట్లాగే చేస్తాను - అడుగు నాయనా!

నేను: జ్యోతిష్యం అన్ని శాస్త్రాలలాగే ఒక శాస్త్రమా? జ్యోతిష్యులు చెప్పేవి జరగడం చాలా అరుదుగా వుంటుంది. గ్రహాలు అనేవి ఉన్నా వాటి గమనం మానవుని జీవనంమీద ప్రభావం చూపుతాయని మీరు నమ్ముతారా?

పరం: జ్యోతిష్యం ఒక శాస్త్రం. అయితే దానిని సరిగా అభ్యసించకుండా జ్యోతిష్యులు ఫలితాలు చెప్పడంవలన దానికిగల ప్రామాణ్యం తగ్గిపోతున్నది. వైద్యశాస్త్రం కదా - అయినా వైద్యుడు సరిగా చికిత్స చేయలేదనుకో - ఫలితం మరోలా వుంటుంది. అంతమాత్రానికి వైద్యశాస్త్రం, విజ్ఞానం కాకపోదు. అలాగే జ్యోతిష్యం కూడా. ఇక గ్రహాల సంగతి - నవ గ్రహాల గతిని బట్టి, మానవుని జీవితం ప్రభావితం అవుతున్నది అనడంలో సందేహం లేదు.

నేను : మీకు జ్యోతిష్యం వచ్చునా? మీ నమ్మకాలకు తగిన ఆధారాలు చూపగలరా?

పరం : నాకు జ్యోతిష్యం రాదు. ఆధారాలు చూపలేను. కాని నాకు వాటిమీద అంటే గ్రహాల అనుకూలత ప్రతికూలతలమీద నమ్మకం వున్నది.

నేను : మీరు ఏమీ అనుకోనంటే చిన్నవాడినైనా ఒక విషయం మనవిచేస్తాను.

పరం : సంతోషం.

వాళ్లబ్బాయి ఇచ్చిన క్లూ బట్టి పరంధామయ్యగారితో ఇలా అన్నాను.

''మీరు ప్రతిదానికి గ్రహాలు అంటున్నారు. దానికి తగిన ఆధారాలు లేనప్పుడు నమ్మడం విజ్ఞత కాదని నా మనవి''

పరంధామయ్యగారికి కాస్త కోపం వచ్చింది. తమాయించుకుని ''నా చేయి చూసి ఇలా అన్నారు. ''నీకు విద్య వుంటుంది. విజ్ఞానం తక్కువ. రీసెర్చి చేసినా నీకు డాక్టరేట్ రాదు'' నేను కోపం తెచ్చుకోలేదు. వారి బలహీనత తెలిసిన నేను వారితో ''మీకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఫలానా సంవత్సరంలో రావలసి వుంది. వస్తుందని అనుకున్నారు. కాని మీరు ఏ ప్రయత్నం చేయకుండా జ్యోతిష్యంమీద నమ్మకంతో నిమ్మకు నీరెత్తినట్లు ఊరుకున్నారుకదూ? అందుచేత మీకన్నా తక్కువస్థాయి ఉపాధ్యాయులు గిరీశంగారికి అవార్డు వచ్చింది. కాదనగలరా?'' అన్నాను కాస్త ఉద్వేగంగా.

పరంధామయ్యగారు ఆశ్చర్యంగా నాకేసి చూస్తూ ''నీకు జ్యోతిష్యం వచ్చా - 15 సంవత్సరాల క్రితం విషయం ఎలా చెప్పేవు'' అన్నారు.

నేను నవ్వుతూ ''గ్రహాలనుబట్టికాదు. ... మనస్తత్వంబట్టి నా ఊహ చెప్పేను. నేను రీ...

చేస్తున్నది సైకాలజీపైన - మీరు నా థీసిస్‌కోసం ఒక చక్కని ప్రత్యక్షమైన ఉదాహరణగా లభించడం నా అదృష్టం. మీరు జ్యోతిష్యం నమ్మకండి. దైవ నిర్ణయం ప్రకారం జరగవలసినవి జరుగుతాయి. వాటిని మార్చడానికి, ఆపడానికి మానవుడికి అన్నివేళలా సాధ్యంకాదు. మీరు ఇందాక నాకు డాక్టరేట్ రాదని జోస్యం చెప్పారు. అది సరికాదు. నాకు వస్తుంది. మళ్లీ వచ్చి ఆ విషయం మీకు చెప్పి మీ ఆశీస్సులు తీసుకుంటాను'' అన్నాను.

సరిగా నెలరోజుల తర్వాత నాకు వచ్చిన డాక్టరేట్ పట్టాతో వెళ్లివారి పాదాలకు నమస్కరించాను. పరంధామయ్యగారు పరమానందంతో నన్ను దీవిస్తూ ఇలా అన్నారు. ''నీవు చెప్పినది నిజం. నేను గ్రహాల సంగతి విడిచి కర్తవ్యం చేస్తున్నాను. నాకు ఫలితాలు వస్తున్నవి''! వారికి ధన్యవాదాలుచెప్పి ఇంటిముఖం పట్టాను.

